పర్యవేక్షిస్తేనే.. నాణ్యమైన భోజనం

• సర్కారు బడుల్లో ఆహార కమిటీలపై కసరత్తు • పురుగులున్న బియ్యంతో వంట చేయకుండా చర్యలు
• నాసిరకం కూరగాయలు, సరుకుల పై కట్టుదిట్టం • ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి





సాక్షి,సిటీబ్యూరో: మెనూ బాగున్నా అమలులో కష్టాలు తప్పడం లేదు. నిత్యావసరధరల పెరుగుదల కారణంగా గిట్టుబాటు కాక విద్యార్థులకు నాసిరకం భోజనమే గతవుతోంది. ఇటీవల రాష్ట్రంలోని విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో అంతటా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు జిల్లాలలోని ప్రభుత్వ బడుల్లో తగిన పర్యవేక్షణకు మండల నోడల్ అధికారులను నియమించారు. వీరు రోజూ మండలాల్లోని బడుల్లో పర్యవేక్షణ చేస్తే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా మెలిగే అవకాశం ఉంటుంది.

అమ్మ ఆదర్శ కమిటీల పాత్ర కీలకమే..

◆ అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పడి 11 నెలలు కావస్తోంది. వీరి పాత్ర పాఠశాల నిర్వహణలో నామమాత్రమైంది. మధ్యాహ్న భోజనం ఎలా ఉందో కమిటీ సభ్యుల పర్యవేక్షణ అవసరం. వసతుల కల్పనపై ఆదర్శ కమిటీలు నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యా నిపుణులు చెబుతున్నారు. వంట చేసే వేళ శుభ్రతపై దృష్టి పెట్టాలని పేర్కొంటున్నారు.

ఆహార కమిటీల మాటేమిటి..

◆ బడిలో వండిన భోజనాన్ని ముందుగా ఇద్దరు ఉపాధ్యాయులు, విద్యార్థులు మొదట పరిశీలించాలి. ప్రధానోపాధ్యాయులు కూడా వంటల రుచి చూడాల్సి ఉంటోంది. వీరు భోజనం రుచి చూశాకే మిగతా విద్యార్థులకు అందించేలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటోంది. వంట పాత్రలు ఎలా ఉన్నాయో సరి చూడాలి. కొంతకాలంగా అనేక బడుల్లో ఆహార కమిటీల పాత్ర అంతంత మాత్రంగానే ఉంటోంది.

నిధులు పెంచితేనే సత్ఫలితాలు

◆ మధ్యాహ్నభోజన ఏజెన్సీలకు ఏళ్ల నాటి నుంచి ధరలు పెరగడం లేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు చాలీచాలని నిధులతో అరకొరగా భోజనం వండి విద్యార్థులకు సమకూరుస్తున్నారు. పైగా నెలల తరబడి బకాయి బిల్లులు చెల్లింపులకు నోచుకోక ఏజెన్సీ నిర్వాహకులు వంట తయారీపై నిర్లక్ష్యం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. నిధులు పెంచితేనే పిల్లలకు నాణ్యమైన భోజనం అందించే వీలుంటోంది. ఈ విషయమై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీఈఓ విజయకుమారి స్పందిస్తూ.. ఇప్పటికే బడుల్లో మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ పెంచామన్నారు. ఇటీవల నియమితులైన మండల నోడల్ అధికారులకు రోజూ తనిఖీలు చేసేలా చూస్తున్నామన్నారు.

విద్యార్థులు కూడా సభ్యులే

ఇకపై మధ్యాహ్న భోజన పథకం అమలులో ఆహార కమిటీ సభ్యులే కీలకంగా వ్యవహరించనున్నారు. నాణ్యతపై పర్యవేక్షణకు వారికి పూర్తి బాధ్యతలు అప్పగించనున్నారు. ప్రతి బడిలో ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు, తరగతికొక విద్యార్థి కమిటీలో సభ్యులుగా ఉంటారు. నాసిరకమైన సరకులు వినియోగిస్తే తిరస్కరిస్తారు. శుభ్రతపై దిశానిర్దేశం చేస్తారు. భోజనానికి ముందు రుచి, నాణ్యతను కమిటీ సభ్యులు చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డిస్తారు.

గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లో 2,437 సర్కారు బడులు

◆ గ్రేటర్‌తో సహా శివారు జిల్లాలలో 2,437 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 505 ప్రభుత్వ పాఠశాలల్లో 87,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జిగా నియమించారు. రోజుకు ఎంత మంది హాజరవుతున్నారు? ఎంతమంది భోజనం చేస్తున్నారు? కోడిగుడ్డు పెడుతున్నారా? రాగిజావ, మెను అమలవుతుందా? తదితర వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. అయితే చాలా చోట్ల పథకాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. నాణ్యత లేకున్నా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతను గాలికొదిలేస్తున్నారు. దీంతో నాణ్యత లోపించి పిల్లలు అస్వస్థతకు గురవుతున్నారు.

నాణ్యత పెంచేందుకు పకడ్బందీ చర్యలు



విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. ఆహార కమిటీల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హెచ్చరిస్తున్నాం. మండల నోడల్ అధికారులు తరచూ సందర్శించి భోజనాన్ని తనిఖీ చేస్తున్నారు.

– డీఈఓ ఐ.విజయకుమారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

నేడు జంతు నియంత్రణ కేంద్రం ప్రారంభం

పోచారం: నారపల్లిలోని సురేందర్‌రెడ్డినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను (జంతు జనన నియంత్రణ కేంద్రం) సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నుట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి తెలిపారు. జంతు జనన నియంత్రణ కేంద్రం వినియోగంలోకి వస్తే వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించవచ్చన్నారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఘట్‌కేసర్: డంపు చేస్తున్న రేషన్ బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. ధరావత్ రంజి, ధరావత్ నందన్ ద్విచక్రవాహనాలపై పట్టణంలో రేషన్ బియ్యం సేకరించి కుమ్మరి బస్తీలో డంపు చేస్తుండగా ఎస్సై పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారిని విచారించగా తక్కువ రేటుకు బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మేడ్చల్: గౌడవెల్లి మున్నూరుకాపు సంఘం రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఆదివారం గౌడవెల్లిలో నిర్వహించిన సంఘం సమావేశంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి సంఘం పటిష్ఠతకు, మున్నూరు కాపుల అభివృద్ధి కోసం మాట్లాడారు. సమావేశంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రాజు, సంఘం నాయకులు వీరేష్, విష్ణు, సంతోష్‌భాను తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ కవికి సర్వేపల్లి స్ఫూర్తి పురస్కారం



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి సెయింట్ క్లారెట్ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు కవి గుండవరం కొండల్‌రావుకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తి పురస్కారం లభించింది. కరీంనగర్ వేదికగా ఉన్న భవానీ సాహిత్య వేదిక కొండల్‌రావుకు పురస్కారంను ఆదివారం అందజేసింది. కొండల్‌రావు రచించిన 'మారని బతుకులు' పుస్తక ఆవిష్కరణ చేశారు.

హామీలను అమలు చేశాం : ఎమ్మెల్సీ

ఘట్‌కేసర్: ఇచ్చిన హామీలు అమలు చేశామని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినందుకు నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఉమ్మడి ఘట్‌కేసర్ మండలం, ఉమ్మడి కీసర మండలంలోని 407 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో ఆదివారం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేశామని, ఏమైన పెండింగ్‌లో ఉంటే పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేస్తామని, తెలంగాణలో ప్రతి మండలంలో చెక్కులు అందజేస్తున్నామన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీల అమలులో ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేసేది లేదని, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు పావనీజంగయ్య, ప్రణీతాగౌడ్, చైర్మన్లు కొండల్ రెడ్డి, చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, తహసీల్దార్లు రజని, హసీనా, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, జంగయ్యాయాదవ్, కౌన్సిలర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళాసాధికారితలో రాష్ట్రం ఆదర్శం

మేడ్చల్: మహిళా సాధికారిత సాధనలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఆదర్శమని ఎమ్మెల్సీ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మేడ్చల్, మూడు చింతలపల్లి, శామీర్‌పేట్, కాప్రా మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఆయన ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల కోసం ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సబ్సీడీపై వంట గ్యాస్ వంటి పథకాలు అమలు చేస్తుందని అన్నారు. స్వయం సహాయక సంఘాలకు చేయూత వంటి పథకాలు చేపట్టి మహిళల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో 584 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఆదివారం పంపిణీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరుల పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ప్రజల కోసం అంబేడ్కర్ అలుపెరగని పోరాటం చేశారు



మాట్లాడుతున్న సురేష్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: దేశంలోని పీడిత ప్రజలు ఎదుర్కొన్న అంటరానితనం రూపుమాపడానికి అంబేడ్కర్ అలుపెరగని పోరాటం చేశారని రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రముఖ న్యాయవాది సురేష్‌కుమార్ యాదవ్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని జీవితంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రాందాసు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, కృష్ణగౌడ్, సత్యం, రాజేష్‌కుమార్, అంజయ్య, గణేష్, ఆనంద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కీసర: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు అన్నారు. ఆదివారం కీసరలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో వారం వారం జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్వేతనాగరాజు, కీసర మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కృష్ణాయాదవ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధానకార్యదర్శి తుడుం శ్రీనివాస్, చీర్యాల గ్రామ మాజీ సర్పంచ్ ధర్మేందర్, నేతలు ఎల్లయ్య, శశిధర్, భానుచందర్, హన్మంత్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గణేష్, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో.. నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు తదితరులు

దుస్తుల పంపిణీ

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల యాజమాన్యం క్రిస్మస్ పండుగ సందర్భంగా జిప్సి చర్చి సభ్యులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. స్కూల్ కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ అంటేనే ఇచ్చి పుచ్చుకోవడం అన్నారు. మనకు ఉన్న దాంట్లో ఎంతో కొంత పేదలకు దానం చేయాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగి సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, డాక్టర్లు రవితేజ్, ధరణి, పాస్టర్ పన్నీర్ సెల్వం పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

బోడుప్పల్: చెంగిచర్ల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా క్రిష్ణగౌడ్, ఉపాధ్యక్షులుగా బాలరాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బొడిగె మల్లేష్‌గౌడ్, కోశాధికారిగా రాజుగౌడ్ ఎన్నికయ్యారు. గౌడ సంఘం ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఇళ్ల లబ్ధిదారులకు 15 రోజుల్లో పట్టాలు అందజేస్తాం



కీసర: కీసర డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు 15 రోజుల్లో పట్టా సర్టిఫికేట్లు అందజేయనున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఉదయం కీసర డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు మండల కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో బోడుప్పల్‌లోని తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇళ్ల కేటాయింపు సమయంలో తమకు అందజేయాల్సిన పట్టాలను ఇప్పటివరకు అందజేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇటీవల విద్యుత్ అధికారులు తమ గృహసముదాయాల వద్దకు వచ్చారని ఇళ్ల మంజూరు పత్రాల కాపీలను తమకు చూపిస్తేనే విద్యుత్ సరఫరా చేస్తామంటున్నారని, లేకుంటే విద్యుత్ సరఫరాను తొలగిస్తామంటున్నారని వజ్రేష్‌యాదవ్‌కు తెలిపారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించి 15 రోజుల్లో పట్టా సర్టిఫికేట్లు అందజేస్తామన్నారు. అదే విధంగా కాలనీలో సౌకర్యాల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నేతలు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ



ఘట్‌కేసర్‌లో అయ్యప్ప స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణం శివారెడ్డిగూడలోని శ్రీ దండ్లగడ్డ వీరాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేలాదిగా అయ్యప్ప భక్తులు రావడంతో పండుగ శోభ సంతరించుకుంది. పంచాయతీ కార్యాలయం సమీపంలోని అయ్యప్ప ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా శివారెడ్డిగూడ ఆలయం వరకు స్వామివారిని ఊరేగించారు. అనంతరం పద్దెనిమిది మెట్లపై పడి వెలిగించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, రాంరెడ్డి, అంజిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.



చీర్యాలలో.. పడిపూజలో టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

పడిపూజలో టీపీసీసీ ఉపాధ్యక్షులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాలలో గురుస్వామి పుల్లగుర్ల శ్రీనివాస్ 18వ పడిపూజ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ నేత నక్కా ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్‌నేతలు నర్సింహులు, కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మహా పడిపూజలో అయ్యప్ప స్వాములు

వైద్య శిబిరానికి విశేష స్పందన

మల్లాపూర్: మల్లాపూర్ దుర్గానగర్ ప్రభుత్వ పాఠశాలలో బద్రి విశాల్, పన్నాలాల్ ప్రీతి ట్రస్ట్, అగర్వాల్ సేవాదల్, యాదవుల సేవా సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి, అనంతరం మందులను అందజేశారు. శ్రీకాంత్‌యాదవ్, శరత్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, స్థానిక నేతలు మహేందర్, పీఆర్.ప్రవీణ్, శ్రీనివాస్, ఎల్‌సీఎస్ దండు ఐ ఇనిస్టిట్యూట్, కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి, భగవాన్ మహావీర్, విక్లాంగ్ సహాయక సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ కంచె తగిలి వ్యక్తి మృతి

శామీర్‌పేట్: విద్యుత్ కంచె షాక్ తగిలి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం, పొన్నాల్ గ్రామంలో గల గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీకి చెందిన వ్యవసాయ పొలంలోకి అడవి మృగాలు రాకుండా నియంత్రించేందుకు శనివారం రాత్రి విద్యుత్ కంచెను ఏర్పాటు చేశారు. ఈ విషయం గమనించకుండా అటుగా వెళ్లిన ఓ గుర్తుతెలియని వ్యక్తి వయస్సు (45) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యుత్ కంచె ఏర్పాటుకు ముందస్తు అనుమతి తీసుకోకపోవడం, ఇష్టానుసారంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేసినందుకు గానూ కంపెనీ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిపై వెలగని విద్యుత్ దీపాలు



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి నుంచి జోడిమెట్ల చౌరస్తా వరకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు వెలగక ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ దీపాల నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. శీతాకాలంలో రాత్రి వేళ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రిలే నిరాహార దీక్షలకు ఎమ్మెల్యే సంఘీభావం



ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతి అందజేస్తున్న మహిళలు

ఘట్‌కేసర్: రైల్వే వంతెనను త్వరితగతిన నిర్మించాలని జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలో మహిళలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంగు రాధిక, సుభాషిణి, విష్ణుప్రియ, రమాదేవి, మాధవి, మమతా శర్మ దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సంజీవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు ప్రమోద్ గుప్తా, కమలాకర్, విక్రమ్‌రెడ్డి, ఖలీల్, యాదగిరి, సత్తి, మురళిగౌడ్, సురేందర్‌రెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మరిన్ని వైద్య సేవలు

బోడుప్పల్: పేద, మధ్యతరగతి ప్రజలకు మరిన్ని ఉచిత వైద్యసేవలు అందాలని 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్ ఆకాంక్షించారు. అంబేడ్కర్‌నగర్ బస్తీ దవాఖాన దగ్గర ఆదివారం పరమిత ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అన్ని రకాల వైద్య సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 4వ డివిజన్ పరిధిలో సీసీరోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త ప్రవంతి కిశోర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.